# మా మాట

రండి! మనమంతా కలిసి పలుకుదాం సర్వధారి సంవత్సరానికి సుస్వాగతం.

పాఠకులైన మీకందరికి తెలుగు కళాసమితి కార్యవర్గం తరపున, తెలుగు జ్యోతి సంపాదకవర్గం తరపున నూతన సంవత్సర శుభాకాంక్షలు. ప్రతి రెండు నెలలకి మీ ఇంటిముంగిళ్ళలోకే కాక మీ హృదయ ప్రాంగణాల్లోకి కూడా మమ్మల్ని సాదరంగా ఆహ్వానిస్తున్న మీకందరికి మా ధన్యవాదాలు.

1984లో మొట్టమొదటి సారి కీర్తిశేషులు శ్రీకిడాంబి రఘునాథ్ గారి ఆధ్వర్యంలో రూపుదిద్దుకున్న పసిడిబుగ్గలబాల మన **తెలుగుజ్యోతి,** ఈయేటికి పాతికేళ్ళ పడుచై పుట్టినరోజు పండుగ చేసుకుంటోంది. మనగుండెల్లో జ్యోతులు వెలిగించిన ఈ జ్యోతికి పుట్టినరోజు పండుగ చెయ్యాలన్న మా చిన్ని ప్రయత్నమే ఈ తెలుగుజ్యోతి ప్రత్యేక సంచిక వెయ్యడం, పోటీలు పెట్టటం, బహుమతులు ఇవ్వటం ఇవన్నీనూ.

కంప్యూటరులు, కీబోర్డులు, మౌసు క్లిక్కులూ, వెబ్ పేజీలూ ఎన్ని వచ్చినా పుస్తకం విలువ పుస్తకానిదే. కాలం మారినా "తల్లీ! నిన్ను దలంచి పుస్తకము చేతన్ బూనితిన్" అనే ఇంకా చదువుల తల్లిని ప్రార్ధిస్తూనే వున్నాంకదా. వందలాది సంవత్సరాలుగా వస్తున్న "పత్రిక అచ్చువేసుకోవడం" అనే ఈ సంప్రదాయాన్ని మనకు చేతనైనంత కాలం కొనసాగిద్దాం.

ఇన్నేళ్ళూ ఈ జ్యోతిని మీకు అందించ టానికి సంపాదకులు చేసిన కృషి, తమ రచనల ద్వారా ఈగడ్డనుంచి, మనం పుట్టిన గడ్డనుంచి బోలెడంతమంది రచయితలు, చేసిన పోషణ మరువలేనివి. గతాన్ని గుర్తు చేసుకోవటం, వాలుకుర్చీలో వాలి నెమరు వేసుకునే కమ్మటి భావం అయితే, భవిష్యత్తులోకి చూడటం కలానికి, మెదడుకి పదునుపెట్టి, మొదలు పెట్టిన కళాఖండానికి మెఱుగులు దిద్దే బరువు, బాధ్యతా అవుతుంది. ఇది ప్రజలే రాజులైన యుగం మరి. అంటే అర్థం ఏమిటో తెలుసా? ఆల్‌రెడీ మీరు తిక్కనలు, తిమ్మనలు, పోతనలు, వేమనలు, అయ్యారు. అంతటితో ఆగిపోకండి మరి. మీరే రాజరాజనరేంద్రులు, ప్రౌఢదేవరాయళ్ళు, శ్రీకృష్ణదేవరాయళ్ళు అవ్వాలన్న సంగతి మాత్రం మర్చిపోకండేం. తాళపత్రాలమీద రాస్తారో, కీ స్ట్రైకులే మీకు నచ్చుతాయో అది మీయిష్టం. మన జ్యోతికి గండపెండేరాలే తొడుగుతారో, కనకవర్షాలే కురిపిస్తారో, అగ్రహారాలే ఇస్తారో అది మీ ఛాయిస్సు. మీరందరూ కూడా ఇందులో భాగస్వాములు కావటమే మా కోరిక, మావిన్నపం.

ఈ ప్రత్యేక సంచికలోని రచనలన్నిటినీ గుచ్చుతున్న దారం ప్రేమ భావన. మేము పెట్టిన ఈ పోటీలలో ఎంతో ఉత్సాహంతో పాల్గొన్న రచయితలకి, మా అభ్యర్థనని మన్నించి మాకు తమ రచనలను పంపించిన ఇతర రచయితలకి, ఇతోధిక ధనసహాయాన్ని అందించిన మిత్రులకి సంపాదకవర్గం వారి కృతజ్ఞతాభివందనలు.

ప్రేమని విభిన్న కోణాల్లో చూపిస్తున్న ఈసంకలనాన్ని మీరందరు చదివి ఆనందిస్తారని, ఈ రచనలు మనందరిలో "బ్రతుకు సుఖముకు రాజమార్గ" మైన ప్రేమ భావాన్ని పెంచుతాయని ఆశిస్తూ...

"ప్రేమ నిచ్చిన ప్రేమ వచ్చును,
ప్రేమ నిలిపిన ప్రేమ నిలుచును"

అన్న గురజాడవారి మాటే మనందరి మాటా కావాలని అంటూ సెలవు తీసుకుంటాను మరి. తెలుగుజ్యోతి సంపాదకవర్గం తరపున.

**- మీ కాశీనాథుని రాధ**

Telugu Jyothi Special Issue April 2008